

# యమపాశం

## మల్లిబాబు

ఫలించబోని ఆశలతో ఎగిరిపడతాడు యువకుడు; జరగని అనుభవాలని స్మరించుకుని చతిగిల బడతాడు వృద్ధుడు; ప్రస్తుతంలో సజీవుడై సంచరించడం వొక్క నడివయస్కుడికే సాధ్యం — అనుకుంటూ తాత్కాలికంగా సంబరపడినా,

నారాయణస్వామి నడివయస్సుతో పూర్తిగా సమాధానం కుదుర్చుకోలేదు తన ముప్పైయ్యో యేట. నలభై దాటిం తర్వాత నడివయస్సనుకునేవాడు; నలభై పూర్తయ్యాక. నలభై అయిదు దాటనీ చూద్దాం అనుకునేవాడు. ఇప్పుడు నలభై ఏడు. యాభై రావాలిగా — ఇంకా మరో మూడేళ్ళు గడు వుందిలే, అనుకుంటున్నాడు. ఇందిర తనకంటె ఏడేళ్ళు చిన్న — సన్నగా, పొడుగ్గా, 'కడ్డీ శరీరం' — అనవసరమైన మాంసం, కండ వొంటిమీద కనబడదు. జుట్టులో అక్కడక్కడ తెల్ల వెంట్రుకలు, తలంటు పోసుకున్నాక మరీ కొట్టొచ్చినట్లు కనబడినా — సవరం జోడించి మెలితిప్పి కడితే, తన జుట్టు విషయం మరిచిపోవొచ్చు. ఆమె కళ్ళల్లో పెండ్లినాడున్న తళుకు కొంత తగ్గినా, ఆ తగ్గుదల దైన్యంగా పరిణమించింది. వక్షంలో బిగి, నడుంపై నును పు ఇప్పుడు లేవు నిజమే; ఆధునిక పరికరాలు, సరైన వస్త్రధారణ తెలుసుకుంటే, సౌందర్య భవనం కూలడానికి సిద్ధంగా వున్నట్లు సమాజం గ్రహించలేదు. తాము స్వయంగా పెనవేసి, చుట్టి, దాచుకోగల ఇసుక త్రాళ్ళల్లో వార్ధక్యాన్ని వారించడానికి ఉభయులూ చేసే యత్నం ప్రధానమైంది.

నారాయణస్వామి, నడివయస్సుతో సమాధానం కుదుర్చుకోలేక పోవడానికి ముఖ్య కారణం, సంతానం లేకపోవడం. కూతురికి వివాహం చేసి, అల్లుణ్ణి పండగకు ఇంటికి తీసుకొచ్చే సమయం ఏనాడో దాటిపోయినా, తానింకా, ఇందిరను పుట్టింటికి తీసుకెడుతూ, అత్తవారింటికి వెళ్తూ వుండడమే జరుగుతూంది. స్నేహితుడు రామారావు మూడోవాడు 'లా' పూర్తిచేశాడు. బావమరిది పెద్దమ్మాయికి రెండో కాన్పు. వారిని కలుసుకున్నప్పుడూ వారి ఉదంతాలు విన్నప్పుడూ, అతని మనస్సులో ఆవేదన రేగుతుంది నిజమే. కాని ఎప్పుడో సంతానం కలగకపోతారా అన్న ఆశ, మరొక ఇసుక త్రాడుగా మెదుల్తూ వుంటుంది. అరవై దాటాక సంతానం కలిగినవారెందరో వున్నారు. వారిని గురించి విన్నప్పుడు, నీళ్ళల్లో కొట్టుకుని పోతున్నవాడికి తాడు అందినట్లు సంబరపడతాడు. కాని, ఆ తాటి రెండు మొదళ్ళూ తన చేతిలో వున్నట్టు గ్రహించే నిబ్బరం తనలో లేదేమోనని నారాయణస్వామికి తెలిసిరావడం, అతని మానసిక జగత్తులో విషాద పరిణామం.

ఇప్పుడు యీ బస్సులో తన ప్రయాణం అత్తవారింటికే. నాన్న వొంట్లో బాగాలేదు, చూసొస్తానంటే, ఇందిరని వారం క్రితం అత్తవారింట్లో దింపాడు. ఆయనకి నిమ్మళంగా వుంది. భార్యని తీసుకురావడానికి వెడుతున్నాడు నారాయణస్వామి.

పత్రికలో కుటుంబ నియంత్రణ వారోత్సవాల విశేషాలు చదువుతున్నాడు. అవి చదవడంలో వొక వింత తృప్తి వుంది. ఆ




గతుకుల రోడ్డులో, ఆ వాసనల మధ్య, ఆ రొద, వూగిసలాటలో కూడా, చదివే టట్లు చేసే తపన వుంది. ఆ వార్తలలో,

దేశంలో జనాభా పెరిగిపోతూంది; దానికి తట్టుకోగల ఉత్పత్తి లేదు. వ్యాధిగ్రస్థులూ, నిరక్షరాస్యులూ, బీదలూ, భరతమాత

భుజాలపై కెక్కి కూర్చుంటే, ఆమె భరించాలి. ఆ మంటలలో తానొక సమిధ వెయ్యక పోవడం ఆ బరువుకి మరికొంత బరువు

చేర్చకపోవడం తాను దేశానికి చెయ్యగల సేవ. ఇది సమాజం గుర్తించని సేవ. అది ప్రయత్న పూర్వకంగా సంక్రమించిన సత్ఫలితం కానందున, దానికి నైతిక విలువ లేదని అతనికి తెలుసు. ఆ జిజ్ఞాసలో కొంత విషాదం వుంది.

బస్సు ఆగిపోయింది. జనం దిగారు. డ్రైవర్, కండక్టర్ బస్సులో తిరకాసుని శోధిస్తున్నారు. నట్లు, బోల్టులూ, వూడదీశారు. చక్రాన్ని విప్పారు. మధ్యాహ్నం, రెండు దాటింది. జోళ్ళక్రిందకూడా చుర్రున తగులుతున్నట్లుగా వుంది ఎండలో రోడ్డు కంకర. దూరంగా, నాలుగైదు కొమ్మలు మిగుల్చుకున్న చెట్లక్రింద నీడ, పథ్యం తిన్న రోగిలా పడివుంది, దానిక్రిందికి నడిచాడు. జనం, బస్సు సర్వీసుపట్ల అసమ్మతిని పంచుగుని వితర్కించుకుంటున్నారు.

"ముందుగా చూసుకోవొద్దూ!"

"నట్టేట్లో దిగవిడిస్తే ఎట్లా?"

"చుట్టుపక్కల ఏరున్నా బాగుండును. పీక ఎండిపోతోంది."

"మూడు ఫర్లాంగుల్లోవుంది ముప్పారం. అక్కడేదన్నా తినేదానికి దొరుకుతుంది. పద, నడుద్దాం."

మీసాల ఆసామీ, మిత్రుడూ, నడవడం సాగించారు.

'ముప్పారం' అన్నపేరు వినగానే, నారాయణస్వామి కంఠంలో ఏదో తీగ కదిలి మోగినట్లయింది. బస్సు ప్రయాణంలో ఎన్నోసార్లు ఆ వూరుమీదుగా వెళ్ళినా, అతను ఆవూరు మళ్ళా ఎప్పుడూ చూడలేదు. ఇరవై ఎనిమిది ఏండ్లక్రితం, అక్కడ వొక సంవత్సరం గడిపాడు — నాన్న ఉద్యోగం చేస్తుండగా. అప్పుడు కాలేజీలో చదువుతుండే వాడు. క్రిస్‌మస్, వేసంగి శెలవులు ఆ వూళ్ళో గడిపాడు. ఇప్పుడు మళ్ళా చూడాలని వుంది. ఆనాడు అతనికి జరిగిన వొక అనుభవం, శరీరంలో రక్తంగా ద్రవించి ఘనీభవించి, యీ ఎండలో కరిగి, ప్రవహించి, జన్మస్థానం వెదుక్కుంటున్నట్లుగా, అతన్ని ముందుకి తోస్తోంది. నడుచుకుంటూ ఊళ్ళోకి వెళ్ళాడు.

సందులు, వీధులూ కొత్తవిగా కనబడుతున్నాయి. మునిసిపల్ బంగళా ఎదురుగా వున్న సందులో వొక మట్టరుగుల ఇంట్లో వుండేవారు.

తలంటు పోసుకునే ముందు, చిన్న వస్త్రం ధరించి, తైలం పూసుకుని, చిందర వందర జుట్టుతో నలుగుపిండీ, పీటా, వెదుక్కున్నట్టుగా కనబడే ఆ నాటి వూరు, తలంటు ముగిసి, ముస్తాబై జుట్టు ఆరబెట్టుకుంటున్నట్లుగా వుంది యీనాడు. ఆ వస్త్రాల వెనక, వొంపులు, కండ తిరుగుళ్లు, ఎముక మెలికలు ఇప్పుడు మాయ మైనాయి.

అవును, 'మాయ'. అతను చూడదల్చుకున్నది 'మాయ' అనే వొక వ్యక్తి. వాళ్ళ ఇల్లు అతని ఇంటి వెనకాల, దొడ్డివైపున వుండేది. రెండు మూడు జామిచెట్లు; పెద్ద చింతచెట్టు, కాస్త దూరంగా డజను తాడి చెట్లు. వాటి మధ్యలో గొడ్లపాక, గడ్డివామి; అవతల పొలం. ఆ రెండిళ్ళకీ మధ్య ఇటికల గోడ అడ్డం. ఒకటి రెండు ఇటికలు ఎవరో వూడదీసి కంత చేశారు. ఆ కంతలోంచి 'మాయని' చూసేవాడు. ఆమె అతన్ని చూసేది. అసలు పేరేమిటో తెలియదు. అందరూ 'మాయ' అని పిలిచేవారు. అప్పుడతని వయస్సు పందొమ్మిది; ఆమెదీ అదే వయస్సు — లేక ఒకేడు చిన్న దేమో.

'మాయ' తల్లి తరచు వాళ్లింటికి వొస్తూ వుండేది — పాలు, పెరుగు, నెయ్యి, తీసుకుని అప్పుడప్పుడు తల్లితో తనూ వొస్తుండేది. మాట్లాడదు; సిగ్గు, భయం — వాటిమీద వొంతెన వేసినట్లు చిరునవ్వు. అందమైన పెద్దకళ్ళు; ఆమె అంతరంగం అంతా ఆ కళ్ళల్లోనే దర్శనం; వేరే దాపరికం లేదు. మెరుగెట్టిన రాగిలో కొత్తదనం జ్ఞప్తికి తెచ్చే శరీరఛాయ; మధ్యపాపిడి, — వొంకీలు లేని సాఫీ జుట్టు. నుదిటిమీద మాత్రం వొద్దున విరిగిన కెరటానికి మల్లే, వొంగిపడిన వెండ్రుకల సముదాయం, గడ్డంపైన, నోరుకి కుడివైపున వొక నల్లటి మచ్చ.

ఆనాడు నారాయణస్వామి వాటిని పరీక్షగా చూడలేదు. ఆ మచ్చ వొక్కటి మాత్రం జ్ఞాపకముంది. మిగత శరీరం, అవయవాలూ, వ్యక్తి ఉనికి, కొట్టుకునే జీవుడు — ఇవన్నీ అస్పష్టంగా, మేఘం పొరవెనక చందమామలా, క్షణం మెదిలి మాయమౌతాయి. యవ్వనంలో అందం చూడలేడు మనిషి; దాన్ని పరామర్శించి అందలి లయని పైకిలాగి, ఊహలో సుస్థిరంగా కూర్చలేడు. కన్ను, ముక్కు, చెవి చిన్నప్పుడు విడివిడిగా, దేనికది పనిచేసి, తన ప్రత్యేక వునికిని ఋజువు చేసుకోవు. ఇంద్రియాలన్నీ మొత్తంగా విజృంభించి, శరీరమై, దొరికిన అనుభవాన్ని తనలో కలిపేసు గుంటుంది యవ్వనం. సముద్రగర్భం కోటి గుఱ్ఱాల శక్తితో కదలి, వొందేసి గుఱ్ఱాలను వొక కెరటంగా పంపేస్తే, ఆ కెరటాలన్నీ వొద్దున స్వారిచేసి, వొక పల్చటి, తెల్లటిపొరని ఇసుకమీద దిగవిడుస్తాయి. అంతటిశక్తీ, ఇసుకలో కరిగిన ఆ నురుగు పొరగా అంత మొందుతుంది — అట్లాగే యువపాశం నడివయస్సుని బంధిస్తుంది.

ఇప్పుడు ఆ ఇల్లు అక్కడలేదు. దాని స్థానే, డాబా లేచింది — బైట పసుపురంగు, వరండా నీలంరంగు — ఎవరో ఉద్యోగి వుంటున్నాడుట. ఆయన కాంప్ కెళ్ళాడు — అని అరుగుమీద పరున్న ముసలి నౌకరు చెప్పాడు. దొడ్డివైపుకి వెళ్ళాడు నారాయణ స్వామి. తలుపుతోశాడు — అది గడలతో కట్టిన గేటు తలుపు. ఒచ్చేసింది. నుయ్యి వుంది. జామి చెట్టులేదు. కంతగల ఇటుకల గోడ లేదు. ద్రమ్ముమీద లేచి నిలబడి చూశాడు. దూరంగా పాకలో పిల్లలు ఆడుకుంటున్నారు. దూకి చూస్తే?

ధైర్యంచాలదు. ముసలి నౌకరునిఅడిగాడు, 'మాయ' తాలూకు ఎవరన్నా వున్నారా అని. తెలీదని గాండ్రించి ఊసి మళ్ళా పరున్నాడు.

ఎవ ర్నడగాలి ? పోస్టాఫీసు వాళ్ళకి తెలుస్తుందేమొ ! పోస్టాఫీ సెక్కడ ?

నాలు గైంది. ఊళ్ళో కెళ్ళి కాస్త కాఫీ త్రాగి వొచ్చాడు. ఊళ్ళో పెద్దలకి తెలుస్తుందేమొ ! కాని ఏమని అడగడం ? తనంతట తనే స్వయంగా ఆరా తియ్యాలి. అత్తవారి ఊరు అక్కడికి మరో తొమ్మిదిమైళ్ళుంది. రాత్రి బస్సులో వెళ్ళొచ్చు. లేకపోతే జట్కా చేయించుకుని వెళ్లొచ్చు.

'మాయ'ని ఊహించలేక పోతున్నాడు. ఆమెకి చెల్లెలో, అక్కో వుండాలి ; వొకటి రెండు మార్లు ఆమెని దొడ్లో చూసి 'మాయ' అనుకున్నాడు. ఇంకా నయం పిలవలేదు. ఆ ఇంట్లో 'మాయ' తాలూకు మొగవాళ్ళు ఎవ్వరూ వున్నట్లు తనకు తెలియదు. కిర్రుజో దేసుగుని, పాగా చుట్టి, పొలంలో వుండేవారేమో, అత నెప్పుడూ చూడలేదు.

సాయంత్రం, గోడ కంతలో నుంచి మాయని చూసేవాడు. అతన్ని చూడ్డానికి తనూ గోడవతల తిరిగేది.

నాలుక బైటపెట్టి వెక్కిరించే వాడు. తనూ వెక్కిరించేది. ముక్కు కోసేస్తానని సంజ్ఞ చేసేవాడు, తనూ చేసేది. జామిపండ్లు కోసితనవైపు గిరవాటేసేది.

"నీ పేరేమిటి దొంగపిల్లా ?"

"నీ పేరేమిటి మాయస్వామీ ?" అని ఎదురు ప్రశ్న.

వాళ్ళమ్మ పిలిస్తే వాళ్ళింటికి వెళ్లాడు వొక మారు. తివాచి పరిచి కూర్చోమంది. తినేటందుకు ఎవో పెట్టింది –

"చూడండి ఎంతసిగ్గో మాయపిల్లకి. కాస్తంత దాహం తీసుకురావే, మాయదారి పిల్లా. అందుకనేనండి, దానికి ఆ పేరు పెడత." అంది వాళ్ళమ్మ. తను నవ్విన జ్ఞాపకం. మాయ తలుపు వెనక నిలబడింది, సగంమొహం కనబడేటట్లు. ఆమె నుదిటి మీద కుంకుమ, జ్యోతిలా వెలిగింది, ఆ చీకటి గదిలో. ఆమె భయం సిగ్గుగా మారి సౌందర్యంగా అంతమైంది.

బాగా జ్ఞాపకం.



యజ : "ఏమే సీతా ! నీ వయస్సెంత ?"
పనిమనిషి : "నా కిప్పుడు 18 సంవత్సరాలమ్మా."
యజ : "మూడు సంవత్సరాలనాడుకూడా యిలాగే అన్నావ్ ?"
పని : "నేను అందరిలాగా ఆడితప్పేదానిని కాదమ్మోయ్."

ఆ సాయంత్రం వెన్నెల,చెట్ల నీడలమధ్య దాగిలిమూత లాడుతోంది. దూరంగా పాకలో దూడలు పారావేస్తున్నాయి. చెట్లు ఆకులు వూపిరి బిగపెట్టి చోద్యం చూస్తున్నాయి. సిగ్గు విడిచి సంధ్య, కడసారి మేఘాన్ని తనతో లాక్కుపోయింది. 'మాయ' దొడ్లో కొచ్చింది. ఆమెని వొంటిగా విడిచేసి, వాళ్ళంతా ఎక్కడికో వెళ్ళిపోయ్యారు. చర చర మెట్లు దిగుతుంటే వోణి అంచు, కాలి కింద మడత పడి, ఆమె గడ్డిలో పడి పోయింది. చివాలున గోడ దూకాడు నారాయణస్వామి. అంతకుముందే ఆమె లేచి పోయింది. ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసింది. ఏదో పరిమళం అతన్ని చుట్టుముట్టింది. లోపలికి వెళ్ళబోయింది 'మాయ'. చెయ్యి పట్టుకున్నాడు. గాజు పలుక్కుమంది.

చెయ్యి విదిల్చింది.

"దెబ్బ తగిలిందా ?"

లేదన్నట్లు తల పంకించింది.

నడుస్తూ పాక దాటారు. గడ్డివామి అంచున కూర్చున్నారు. గడ్డిపోచలు తీసి, తన కాలివేళ్ళ మధ్యగా పోనిస్తూంది. మాటల్లేవు. ఆమె మెడచుట్టూ చెయ్యి వెయ్యాలనుంది. భయం.సంకోచిస్తున్నాడు. మోకాళ్ళ మధ్య మొహందాచి, వోరగా వొకకన్నుతో అతనివైపు చూస్తోంది. వోణి అంత అందంగా నడుంచుట్టూ అమరడం అతను ఇదివరలో చూడలేదు. తుపాను మేఘాల మధ్య అంగుళంమేర నీలి ఆకాశం కనిపించినట్లు, ఆ మడతలోంచి, పొట్టమడత కనిపిస్తోంది – ఇంకా వొయ్యారంగావొంకర తిరిగే శక్తి తెచ్చుకోలేని చర్మం.

మాట్లాడుతూంటే వినాల నుంది – ఆమె కంఠం.

"తినేటందుకు ఏమీలేదా ?"

సమాధానం లేదు,

"మీ అమ్మావాళ్ళు ఏరి ?"

అల్లా దూరంగా వెళ్ళారన్నట్టుగా కంటి పాపని, తలని కదిపింది – చేతిని వాటితో

లయ కలుపుతూ, ఏదో లాగుతోంది—వింత వాసన - దూడలపేడ, గడ్డిపూలు, తాటిపండు పండిన వాసన - కల్లు, కాలిన రోజాపుష్పం, చందమామ ఆవులించిన తుంపర పరిమళం— అందులో లీనమైపోయిన, ఆమెలోని యవ్వనపు సముద్రగర్భంలోంచి పొడుచుకొచ్చిన కెరటంపై నురుగు పరిమళం — వుక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

ఆమె నడుంపై చెయ్యివేసి చక్కిలిగింత పెట్టాడు. ఆమె గడ్డిపోచలతో అతని చెవిని, మొహాన్నీ రాసింది. దూరంగా పరుగెత్తుకు పోయింది. కూర్చుని అటూఇటూ చూశాడు. ఎక్కడాలేదు. ఇంట్లోకి వెళ్ళిపోయిందా? వెదుకుతూ పాకవైపు కొచ్చాడు. అక్కడ దూడలు, కింద గడ్డి, పేడ, మన్ను, పైన తాటాకుల మధ్య కంతల్లోంచి, కొత్త రూపాయిలా, తీక్షణమైన వెన్నెలవెలుగు. దూడ వెనక దాగి కూర్చుంది గడ్డిలో. ఆమూల గోనిసంచులు పేర్చివున్నాయి. ఆమె చెయ్యి తగిలింది. వేళ్ళు బిగించింది. గోని సంచుల మీద పడిపోయ్యాడు, ఆమెను తన కౌగిటిలోకి లాక్కుని. అంతా చీకటే—ఆమె కనిపించడంలేదు — తనకి తనే కనిపించడం లేదు. అతనికాలో, ఆమె చెయ్యో — తెలీదు — ముందుకి లాగాడు. కంతలోంచి వెన్నెల. ఆమె గడ్డం పైని మచ్చని వెలిగించింది — కన్నుమూసిన చందమామలాగు కీచురాళ్ళు రొద నిలిపినప్పుడు, ఆమె శ్వాస వినబడుతోంది. వెన్నెల కాంతి పక్కకి కదిలినప్పుడు, ఆమె పళ్ళవరస తళుక్కు మంటోంది. ఆమె శరీరమంతా, వొక కన్నై మెరుస్తోంది. జడ వూడి నిశీధిలా అతని మొహాన్ని కప్పి, సముద్రగర్భంలోకి లాక్కు పోతోంది - యువపాశంవలె చుట్టి. వెన్నెట్లో బంగారు తీగలల్లే మెరుస్తోంది —ఊడిన జడ; శిలలా స్తనాలమధ్య నీడ.

* * *

కాలానికి కదలిక తెలియదు. మళ్ళా కీచురాళ్ళ, పేడపురుగుల సంచలనం, దూడ నోటినుండి చొంగకారే చప్పుడు, గొల్లభామలు తాటాకుల్ని మర్దించే ధ్వనులు,— ఇదంతా మాయ—ఆమె నిండుగావిప్పిన రెండు కళ్ళూ అత నెరిగిన యదార్థం. చూస్తుండగా ఆమె కళ్ళల్లో గుడ్లు పెద్ద వయ్యాయి. నల్ల పాప నిలిచిపోయింది..ఆమెచూపు స్తంభించి పోయింది. ఆమెచెయ్యి అతని మొహంమీద పడింది, నోరు నొక్కింది. దిగ్భ్రమ చెందాడు.

ఇదేమిటి నోరు నొక్కుతోంది!

భయ మేసింది. అదేమిటి ఆమె కళ్ళు అల్లా నిలిచి పొయ్యాయి: కదలదు; మెదలదు; కళ్ళు పెద్దవి చేసి చూస్తోంది — భీభత్సంతో స్తంభించిన చూపుతో. కీచురాళ్ళ రొద నిలిచింది, దూడ కదలదు — గొల్లభామలు పవ్వళించాయి. మట్టిపురుగులు మెదలవు. చీకటి కన్ను మూసినట్లుగా — అంతా నిశ్చలం,

క్షణం; మరోక్షణం; ఎన్నిక్షణాలు: అతని ఊపిరి ఆడదు: గుండె కొట్టుకోదు. నోట మాటరాదు.

అమ్మయ్య అని, 'మాయ' నిట్టూర్చింది. లేచింది. తనూ లేచాడు.

"ఏమిటది?"

ఇంకా అతనికేసి వింతగా చూస్తోంది. అతని వక్షంపై తల ఆనించి, ఏడ్చేస్తోంది.

"ఏమిటది?"

అతనికి అర్థం కావడంలేదు. మతిపోతోంది. ఆమె లేచింది. కళ్ళు తుడుచుకుంది.

"పాము."

"ఆ!"

"అవును. పడగెత్తి మీ తలదగ్గర — అల్లా కళ్ళు పెద్దవిచేసి చూశాను. పడగ దించి అల్లా వెళ్ళిపోయింది - నేనూ వెడుతున్నా" అని లేచి నడుస్తోంది 'మాయ'. నారాయణస్వామికి ముచ్చెమట్లు పోసేస్తున్నాయి. ఒక్క గంతులో పాక దాటి వెన్నెట్లో కొచ్చాడు, పాము అతన్ని తరుముకొస్తూవున్నట్లు.

"వెళ్ళిపోయింది. భయపడకండి" అంటూ 'మాయ' ఇంట్లోకి వెళ్ళింది. బరువుగా అడుగులువేస్తూ గోడెక్కి, తన దొడ్లోకి వూడిపడ్డాడు. పాము పగ పడుతుందటగా. ఇంట్లోవాళ్ళతో చెప్పడానికి వీల్లేదు.

కాలేజి తెరవకుండానే, చదువుకోవాలన్న మిషమీద, మర్నాడు ఉదయమే వెళ్ళిపోయాడు నారాయణస్వామి.

ఆ అనుభవం జ్ఞప్తికొచ్చినప్పుడల్లా, అతని శరీరంలో ఏదో మార్పు జరిగేది — కొన్నాళ్ళవరకూ. ఇప్పు డది పాతబడిపోయింది. 'మాయ' ధైర్యమైన పిల్ల: తర్వాత, వొక ఏడాదికి ఆమెకి వివాహం జరిగిం దని విన్నాడు. అతని తండ్రికి బదిలీ అయింది.తా నింతవరకూ ఆమెను చూళ్లేదు.

ఇప్పుడు చూసితీరాలి. ఎట్లా వుంటుంది? తనని గుర్తు పడుతుందా? పిల్లలెందరు? భర్త ఎవరు? చూడాలి. మళ్ళా దొడ్లోకివెళ్ళి, ఆ ద్రమ్ముమీద ఎక్కి గోడ దూకి, ఆడుకుంటున్న పిల్లల దగ్గరికి చేరుకున్నాడు.

ఆమె వయస్సు తొమ్మిది — కుర్రాడు— వయస్సు ఏడు — మరో అమ్మాయి— ఐదుంటాయా? ఇంకా ఎవరో పిల్లలు - పన్నెండు లోపల.

"నీ పేరేమిటి?" అని పెద్దమ్మాయిని అడిగాడు.

"భువనేశ్వరి"

"చదువుకుంటున్నావా?",

తల పంకిస్తుంది — సమాధానం చెప్పదు.

"ఐదు" అన్నాడు కుర్రవాడు.

"నీ కేమవుతుంది?"

"అక్క"

"మరి యీ బుల్లెమ్మో?"

"చెల్లి."

ఈ ముగ్గురూ వొకతల్లి బిడ్డలే నని తెలుస్తూంది. అందరివీ పెద్దకళ్ళు, వేషంలో అమర్చినట్లు కనబడే, సన్నటి కనుబొమ్మలు. ఆఖరమ్మాయి గడ్డంకింద మచ్చ కూడా వుంది. 'మాయ' ఛాయలు వారి మొహాలలో మెదులుతున్నాయి.

"మీ నాన్న కేం పని ?"

మాట్లాడరు.

"మేం ఇంటికి పోతున్నాం. ఒస్తే తండహో'' అంటూ నలుగు రైదుగురు కదిలారు.

"మీ అమ్మ పేరేమిటి ?''

ఆ ముగ్గురూ వొకరి మొహా లొకరు చూసుకుంటున్నారు. సిగ్గు పడుతున్నారు. పెద్దమ్మాయి, "అమ్మా" అని ఇంటివైపుకి తిరిగి కేక వేసింది. నారాయణస్వామికి భయ మేసింది. ఎవ రని అడిగితే ఏమిటి చెప్పడం ? పరుగెత్తుకు పోవా లనుంది. వెంటబడి తరుమరు కదా ! అతను బిత్తర పోయి చూస్తుండగానే వొకామె గుమ్మం దాటి మెట్టుమీద నిలబడింది. ఎఱ్ఱచీర, — కోలమొహం, — కాస్తంత స్థూలకాయం; సవరాలతో అమర్చిన పెద్దకొప్పు—వయస్సు ముప్ఫైలోపు. ఆమె 'మాయ' కాదు. ఆమె కళ్లు పెద్దవే — మరీ పెద్దవి కాదు. ఆమె మొహాన ఏ మచ్చా లేదు.

ఆమె అతన్ని చూడగానే, అడుగు వెనక్కివేసి తలుపు వెనక్కి వెళ్ళింది.

''గౌరమ్మా" అని కే కేసింది. లోపల్నుంచి, వొక వృద్ధురాలు బైట కొచ్చింది. పిల్లలు ఆమె చుట్టూ చేరి ఏదో మాట్లాడుతున్నారు.


"ఎవరు నాయనా ?'' అంటోంది ముసిలామె.

''ఇక్కడ వెనక వొకామె వుండేది — మాకు పాలూ అవీ పోసేది — అమ్మకి బాగా స్నేహం — చాలా కాలం క్రితం లెండి — ఉందేమో చూసిపోదా మని...''

ముసి లామె నవ్వుతోంది. పళ్లులేవు. నోటిలోపల సంధ్యకాంతి.

"ఇట్లారా చూపిస్తా"అంది. ఆమె వసారా వైపు నడుస్తోంది. తను వెనకాలే వెళ్లాడు. మూలగా వొక గదిలోకి వెళ్ళింది. తనూ వెళ్ళి గుమ్మందగ్గర నిలబడ్డాడు.

''ఇదే నయ్యా."



"కుటుంబాన్ని ఎలా సరిదిద్దుకోవాలి అనే విషయం గురించి ఈవేళ మీటింగులో మాట్లాడాలి. కాస్త పిల్లల్ని చూస్తూండండి !"

మంచంమీద వొకామె పరుంది. పల్చటి మనిషి. దుప్పటి కప్పివుంది. ఆమె జుట్టంతా నెరిసిపోయింది. కండ్లకింద చర్మం, గదులు గదులుగా జారింది. ఆకులు, ముళ్లు రాలిన తుమ్మమ్రోడులా గుంది. ఆమె గడ్డంపై మచ్చలేదు. — ఉన్నా, అనేక మచ్చల మధ్య స్పష్టంగా కనబడ్డం లేదు. ఆమె దగ్గుతోంది. ముసిలామె ఏదో మాట్లాడుతోంది.

నారాయణస్వామి బైటకు వొచ్చేశాడు.

''మా చినముత్తవ్వ"అంది పెద్దమ్మాయి.

అక్కడ వుండలేకపొయ్యాడు నారాయణ స్వామి.

"వారిని కనుక్కో రాఘవయ్యా" అంటోంది ఆ పిల్లల తల్లి.

పాకలోంచి బైట కొచ్చాడు వృద్ధుడు రాఘవయ్య. అరవైపైమాట. — మోకాళ్ళపైకి లాగి బిగించికట్టాడుపంచి. కంబళీ పైన వేసుగున్నాడు. అతని వెనకాలే నడుస్తున్నాడు.

"నా కేమీ అక్కర్లేదు. ఇక్కడ చాలా కాలంక్రితం,వొకామె పాలూ పెరుగూ పోస్తూ వుండేది. ఆమెకి మాయ అని వొక కుమార్తె వుండేది. చూసిపోదామని..." అని చెప్తున్నాడు. రాఘవయ్య నవ్వుతున్నాడు.

"ముప్ఫైఏళ్ళుగా వుంటున్నాను — నేనెరుగుదునులెండి. ఆ గదిలో చూస్తిరే — ఆమె, మాయ అప్పగారు. మంచాన పడింది. మిమ్మల్ని ముంగల పలకరించినామె, మాయ కూతురు. ఆ ముగ్గురూ ఆమె సంతానం...మాయమ్మ మనుమలు, మనమరాండ్రు...'' నడుస్తున్నారు.

"మరి ఆమె...ఆమె తల్లి ?"

"దాని తల్లి కూచుంటుందా ఏం. ఏ నాడో సచ్చి సొర్గాన కెళ్ళింది. మరి, మాయ మనలోనే లేదుగా."

"అంటే ?"

''రెండు మూడేళ్ళుగా దేవుడిలో కలిసి పోయిందిగా."

''అయ్యో..."

"అంటే, భక్తిలో పడింది.

పూజలు, పునస్కారాలు — జపాలూ, తపాలూ, పెద్ద భక్తురాలుగా. మీరు పేరు వినలేదా ?"

"లేదు.''

"ఇంకా నయం, పై వూళ్ళనుంచి జనం దర్శనాని కని ఇరగబడతారు. ఓయబ్బ, వొందలూ, వేలూ — అమావొస్య వొచ్చిందంటే — ఇహ ఇసికేస్తే రాలని జనం, ఓ.

టెంకాయలు కొట్టడాలు, హారతు లివ్వడాలు, పాదాలమీద పడి మొక్కడాలు...''

"నిజంగా? ఇప్పు డెక్కడుంది?"

"ఆవిడ పేరు వినలేదంటే, మీరుంటం ఎక్కడ అంట! ఊరవతల. మునసబు చందాలు పోగుజేసి మందిరం కట్టించాడు వూరవతల. అక్కడే వుంటుంది. ఏదో ధ్యానంలో వుంటుందట. మాట్లాడదు. అందరూ వెళ్ళడం, దర్శనం చేసుగుని మొక్కడం, ఆమె పాదాని కున్న పసుపు పారాణ తీసుగుని బొట్టెట్టుగోటం, కొంత ఇళ్ళకి తీసుకెళ్ళడం..."

"మహత్తు ఏమన్నా వుందా?"

"లేకుంటే జనం ఇరగబడతారా? జబ్బులు నయ్యం అవుతాయంట. పిల్లలు లేని వారికి పిల్లలు పుడతారంట; ఆ పసుపు, కుంకుమ దగ్గరుంచుకుంటె, వొకటేమిటి... ఏది పడితే – అది." నడివీధిలో కొచ్చారు. సాయంత్రం ఏడవుతోంది.

కొట్లల్లో దీపాలు పచ్చగా వెలుగుతున్నాయి. ఆటోతు చెత్త చదారం కెలుకుతోంది. పిచ్చివాడు చినిగిన గుడ్డలతో, గెంతుతూ, నవ్వుతూ, పదాలు పాడుతూ, జనం వెంట పడుతున్నాడు. స్త్రీలు, పురుషులు గుంపులు గుంపులుగా నడుస్తున్నారు. రావిచెట్టు ఆకులమధ్య పల్చటి చందమామ కన్ను మెదుపుతున్నాడు – దూరంగా బస్సు హారన్, జట్కాబండ్ల చక్రాల్లో కర్ర జొనిపి చేసే చప్పుళ్ళు, వొంతెన దిగువున రోడ్డురోలరు – ఇన్నిధ్వనులు చెలరేగినా, వొక నిశ్శబ్దమైన వాతావరణం ప్రబలడం గమనించాడు నారాయణస్వామి.

"ఈ జనం అంతా అక్కడికే" అన్నాడు. రాఘవయ్య.

"ఏమిటి విశేషం?"

"సాయంత్రం, ఏడునించి, పదివరకూ దర్శనాలు."

నారాయణస్వామి మనసెల్లాగోఅయింది. తా నిదివరలో ఎరుగున్న అనుభవం కాదిది. ఆమెని చూడా లనీ వుందీ – చూస్తే తట్టుకోగలనా అనే సంశయమూ వుంది. యవ్వనంలో సౌందర్యం, నడివయస్సులో కీర్తి, వార్ధక్యంలో ఆధ్యాత్మికానుభూతి కోరతాడు మనిషి అంటారు. కాని, తాను నడివయస్సులో రెండుకళ్ళూ పెట్టికూడా సౌందర్యం విడిచేసిన పొరలోంచి బైటపడలేదని గ్రహించడంలో కొంత కారుణ్యం వుంది.

రాఘవయ్య వెనకాలే వొస్తున్నాడు. అతనితో కలిసి నడవడం కోసం అడుగు మెల్లగా వేస్తున్నాడు. ఏదో అంటున్నాడు.

"ఆవిడ కళ్ళు మూసుగుని ప్రార్ధిస్తుంది. మాట్లాడదు; అల్లా చెయ్యి ఇల్లా చెయ్యి అని చెప్పదు. తంత్రం, మాయ, ఏమీలేవు. భక్తులు తమంత తామే, తెలుసుకున్నారు, ఆమె దగ్గరవుండే ఆ పసుపు కుంకుమ పెట్టుగుంటే, కోరికలు తీరుతా యని".

నారాయస్వామి కొందరు భక్తురాండ్ర ఉదంతాలని స్మరించ సాగాడు. 17వ శతాబ్దిలో బహినాబాయి, 12వ శతాబ్దిలో అక్కమహాదేవి వెలుగుని చూసిన భక్తురాండ్రు. అక్కమహాదేవి దైవం చెన్నమల్లిఖార్జునుడు.

''అతడే నా భర్త, నా సౌందర్యమూర్తి. కృశించి, హతమయ్యే లౌకిక భర్త. నా కొద్దు; అతన్ని నిప్పులో వెయ్యి." అని చెప్పుగుందిట, ఎక్కడో చదివాడు. అవిలాలో థెరెసా వొక పాశ్చాత్యదేశపు భక్తురాలు. ఇంకా గౌరీబాయి, 'రబా – అ' అఘోరమణిదేవి, కాశ్మీరంలో లల్లేశ్వరి, సుప్రియ,...ఎంద రెందరో. వారి జీవితాల్లో ఆధ్యాత్మిక పరిణామానికి కారణా లేవి?

''అదుగో వొచ్చేశాం. అదే మందిరం" అన్నాడు రాఘవయ్య.

జనం కిటకిట లాడుతున్నారు. వచ్చేవారు, వెళ్ళేవారు. ఒకటి రెండు అంగళ్ళ ముందు పిల్లలు ఏవో కొనుక్కుని తింటున్నారు. చాలామంది స్త్రీలే – అన్నివెగల వారూను. రాఘవయ్య దిగడ్డాడు. నారాయణస్వామి మెట్లెక్కాడు. చివరి మెట్టుమీద నిలిచిపొయ్యాడు. జనం లోపలికి నెట్టుతున్నారు. ముందుకు వొచ్చేశాడు. ఎందుకు చూడాలి? ఆమె అతన్ని గుర్తుపట్టదు; అతని కేసి చూడదు. త నెవరు? ఆమె ఎవరు? ఎవరో తపస్సు చేసి పరమాత్మలో ఐక్యం అయితే తనకి వొరిగిం దేమిటి? ఆధ్యాత్మిక చింతన కూడా వొకరకం స్వార్ధమే.

ఎప్పుడో చదివిన తరిగొండ వెంకమాంబ వుదంతం జ్ఞప్తి కొస్తోంది. 19వ శతాబ్దిలో వర్ధిల్లిన భక్తురాలు. చిన్నప్పుడే వైధవ్యం ప్రాప్తించింది. ఆనాటి సంప్రదాయం, ఆచారం, జుట్టు తీసెయ్యా లని శాసించింది. ఆమెవల్ల కాదంది; తిరుగుబాటు చేసింది. అందమైన జుట్టు ఎందుకు తీసెయ్యాలి?

సౌందర్యం పట్ల ఆమెకి అంతటి మమకారం. పెద్దలంతా నచ్చజెప్పిచూశారు; గురువులు ఆజ్ఞాపించారు; బహిష్కరించి, శిక్షిస్తా మని బెదిరించారు. ఆఖరుకి బలవంతాన ఆమె జుట్టు తీయించారు. నదిలో స్నానాని కెళ్ళి ఇష్టదైవాన్ని కొల్చింది. దైవం సాక్షాత్కరించింది. నీళ్ళల్లోంచి బైటకురాగానే, నిగనిగలాడే జడతో ప్రత్యక్షమైందని – వొక కథ చెప్తారు. అదీ కథ; నిజంగా జరిగిందా?

జనం తోసేస్తున్నారు. అందరి స్త్రీల మధ్య తనూ మరో పదిమంది పురుషులు – అతనికి సిగ్గేసింది. తోపుకి లొంగిపోయినట్లు, తనని తాను దగా చేసుగుని లోపలికి చేరుకున్నాడు.

ఆమె గదిమధ్యలో వేదికపై ఆసీనురాలై వుంది. తెల్లటి చీర, తెల్లటి రెవిక, మధ్యపాపిడి – పూర్తిగా నెరిసిపోయిన జుట్టు. కనుబొమ్మలమధ్య అక్కడక్కడ తెల్లవెంట్రుకలు – చెవికింతలో లవంగం.

నుదిటిమీద గీతలు. కండ్లకింద జారిన గదులచర్మం; సృష్టివైచిత్రికి తలొగ్గినట్లు, కిందికి వొంపు తిరిగిన నోటి చివరలు; ఈమేనా తా నెరిగిన 'మాయ?' ఆనాడు ఆమె నడుం లొంగదీసుకోడానికి అరచెయ్యి చాచినప్పుడు, భయంతో, గుల్లలోపలికి

వెళ్ళిన నక్షత్రగుల్లలా, జారిపోయిన ఆ శరీరం, ఇదేనా ? కంటిచూపుతో కామాన్ని బంధించివెయ్యగల ఆ మొహం ఇదేనా ? ఏదో చల్లదనం ఆతనిలో ప్రవహించిన ట్లయింది — కనురెప్పల వెనక వేగిరపడుతున్న వెలుగులో చల్లదనం — నక్షత్రాలని గుడారంగా వేసుగుని తలదాచుకొన్న కొండ శిఖరాన్ని పెనవేసుగున్న చల్లదనం.

సందేహంలేదు, ఆమే అదుగో గడ్డంపై, నోటికింద నల్లమచ్చ - వయస్సుతో పెద్దదై, ప్రస్ఫుటమైంది.

ఇలాయిబుడ్లు, గాస్ దీపాలు, గాజు బుడ్లు, హారతులు వెలుగులో ఆమె మొహంలో ఎన్నెన్నో మొహాలు కనబడుతున్నాయి. ఆమె తల్లి మొహం, ఇందాక చూసిన కూతురి మొహం, అక్క మొహం, కూతురి కూతురు మొహం - ఎన్నోకళ్ళు— నాలుగు తరాల నేత్రాలు. జీవితం అల్లా కదలిపోతోంది — తను మాత్రం, ప్రవాహానికి ఎదురుగా కొట్టుకుపొయ్యే పడవకి లంగరేసినట్లుగా — ఆ కళ్ళమధ్య చీకటి — ఆ క్షణం యువపాశం తెగి, తాను విముక్తుడయ్యాడు. సృష్టంతా, తనలోకి చూసుగునే— వొక బీటగా కనిపించి, మాయమైంది.

ఈ మార్పుకి ఆమె జీవితంలో కారణం వుండాలి. ఏం జరిగింది ? ఎవరు చెప్తారు? బైటకొచ్చాడు. మెట్లమీద దూరంగా కూర్చున్నాడు. తన దగ్గర కొచ్చి మరొక వ్యక్తి కూర్చున్నాడు. అతని నీడ తన పాదాలమీద పడింది. రాఘవయ్య కాడు. రాఘవయ్య కనబడడు —

"ఇల్లా ఈమె ఎంతకాలంనుంచి వుందంటారు ?"

ప్రక్కనున్న వ్యక్తి సమాధానం చెప్తున్నాడు -

"రెండు మూడు సంవత్సరాల నుంచి అంటున్నారు."

"అసలు ఈవిడ ఇల్లా ఎందుకు మారిందంటారు ?'' అని అడిగాడు నారాయణస్వామి.

''నాకు మాత్రం ఏం తెలుసు — వారూ వీరూ అంటున్నదే నేనూ అంటున్నాను. ఒకరాత్రి వెన్నెట్లో — మండువాలో తనూ భర్తా, చాపలమీద పరున్నారుట. మహా ప్రాణంట లెండి మొగుడంటె. బోలెడు మంది సంతానం. క్షణం వొదిలి వుండదుట— అల్లా పడుకుని వుండగా, వొక పాము చక్కా వొచ్చి, భర్త తలముందు పడగెత్తిందిట. ఈమె చివాలున దాని నడుం పట్టుకుందిట. వెంటనే అది కాటేసింది. దానికి దొరికింది భర్త మెడ, తన చెయ్యి కాదు, భర్త కెవ్వన కేకేశాడుట. ఆమె పట్టు వొదిలిందిట. పాము పరుగెత్తుకు పోయిందిట. తెల్లవార్లూ మందులు, మాకులు, మంత్రాలు, జపాలు, ఎన్నో ప్రయత్నించారుట. ఊళ్ళో మంత్రగాడు, కరిచిన పాముని, తీసుకొస్తేనే నయం చెయ్యగలనన్నాడుట. పాముకోసం తెగవెతికారుట, కనబళ్ళేదు, ఉదయానికి భర్త కండ్లుమూశాడు — ఆక్షణం నుండి ఆమెకళ్ళు మూతలుపడి, మౌనంలో, తపస్సులో పడిపోయిందిట.''

నారాయణస్వామి లేచి గబగబ వీధిలోకి వొచ్చేశాడు. ముచ్చెమట్లు పోసేస్తున్నాయి. ఆనాడు పాకలో తా నెరిగినభయం, అవహించింది. వేగంగా నడుస్తున్నాడు. జనం పల్చబడ్డారు. వొకటి రెండు జట్కాబళ్ళున్నాయి. అక్కడ గడ్డిలో కూర్చున్నాడు. ఆకాశంలోకి చూస్తున్నాడు. ఆతనికి ఆ అనుభవం కుతూహలాన్ని రేకెత్తించింది కాని, అర్థంకాలేదు. చేతిలోకి దొరికేట్లుంది — ఇసుకత్రాడులా విడిపోయింది. గుండెల లయ తప్పి మళ్ళా సర్దుకున్నట్లుంది. ఆమె తన తభర్తని, తనుగా వూహించుగుని ఆనందం పొందుతున్న సమయంలో, వెనక, తనతో వుండగా జరిగిన సంఘటనే జరగడం చూసి, కోపంతో పాముని తాకిన ఫలితం, భర్త మరణం— తన మరణం. మతిపోయింది. మరో జగత్తులో ఏకాంతంగా జీవిస్తోంది.

ఈ పరామర్శ నిజమనుకోడాకిని ఆధారం లేదు. ఆధారం దాక్కున్న చీకటి లోకంలోకి వెళ్ళగలిగే శక్తి అతనిలో లేదని తెలుసుకున్నాడు. ఆ జిజ్ఞాస అతనిలో విషాదాన్ని మరింత చిక్కబరిచింది.

జట్కా ఎవరిదో ఎదురుగా నిలబడింది. లేచాడు. అందులో తనభార్య, ఆమె దూరపు చుట్టం, ఆవిడ తమ్ముడు వున్నారు. ఇంటికెడదాం, బండిలో ఎక్కమన్నారు, ఎక్కాడు. బండి వెడుతోంది,

ఆవిడ బంధువు అంటున్నాడు,

''అమ్మాయిని తీసుకొచ్చాం. ఏ పుట్టలో ఏ పాముందో. ఈవిడ మహత్తు ఎట్లాంటిదో చూస్తే తప్పేముంది. ఆ కుంకుమ, పసుపు పెట్టుకుంటే సంతానం కలగొచ్చు నన్నారు— ఏం వెలుగు, ఏం తేజస్సు !''

అత నేమీ మాట్లాడలేదు.

''ఏం—నీ కేం నమ్మకం లేదా ?''

"ఏమో చెప్పలేమండీ. ఇట్లాంటి విషయాలపట్ల నమ్మకం కుదరాలంటే, ఏదన్నా విశేషం జరగాలి; విశేషం జరిగితేకాని, నమ్మకం కుదరదు" అన్నాడు నారాయణస్వామి. భార్య నవ్వింది. అతను నిట్టూర్చాడు — ఆ నిట్టూర్పు, విశ్వమంతటా వ్యాపింపజెయ్యాలన్న బరువుగా. ★